కేసీఆర్ వల్లే కుల సంఘాలకు గౌరవ భవనాలు

ఆర్యవైశ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

ప్రజాస్వామ్య బద్ధంగా సంఘాలు నడవాలి

ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 9: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుల సంఘాల అభివృద్ధికి పెద్ద పీట వేశారని మహేశ్వరం నియోజక వర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సామ యాదిరెడ్డి గార్డెన్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయారు. ప్రేమ్ కుమార్ గుప్త ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న అన్ని కుల సంఘాలకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలంతో పాటు డబ్బులు ఖర్చు పెట్టి కుల సంఘాల భవనాలు నిర్మాణం చేయించడం జరిగిందన్నారు. ఆర్యవైశ్యులకు స్థలం రాకపోతే తాను ప్రయత్నం చేస్తానన్నారు. దేవాలయం నిర్మాణం చేసుకోవడానికి పూర్తి స్థాయిలో సహకారం అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పరంగా రావలసిన వాటి గురించి డిమాండు చేస్తానన్నారు. ఆర్యవైశ్యులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. గత ఎన్నికలలో తనకు సహకరించిన ఆర్యవైశ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మీర్‌పేట ఆర్యవైశ్యులు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఓడినా.. గెలిచినా... అందరు అదే సంఘంలో ఉంటారు.. కనుక, సంఘం అభివృద్ధికి తన వంతు చేయూతను ఇస్తానన్నారు. ఆర్యవైశ్యులు డబ్బులు సమీకరించి వారి సంఘంలో ఉన్న పేదల పిల్లలకు సహకరించడం మంచి కార్యక్రమమన్నారు. కార్యక్రమంలోడిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, అమర వాది లక్ష్మి నారాయణ, రాజకీయ మహాసభ చైర్మన్ చింతల రవి కుమార్, జిల్లా అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్త, కోశాధికారి కిరణ్ గుప్త, బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ గుప్త, కన్యకా పరమేశ్వరి ట్రస్టు చైర్మన్ తెరటిపల్లి శ్రీనివాస్ గుప్త, శ్రీరామ చంద్ర మూర్తి, సురేశ్, వెంకటేశ్వర్లు, దీప్‌లాల్ చౌహాన్ తదితరులున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

వికారాబాద్, జూన్ 9 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.


రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్ శశాంక తదితరులు

అక్షర యోధుడా.. సెలవిక..

- అశ్రునయనాలతో రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు అంతిమయాత్ర
- ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ఫిల్మ్‌సిటీలోని స్మృతివనంలో అంతిమ సంస్కారాలు
- కడసారి చూపు కోసం తరలివచ్చిన అశేష జనవాహిని
- రాజకీయ, సినీరంగాల ప్రముఖులు, అభిమానుల ఘన నివాళి

రంగారెడ్డి, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : అవిశ్రాంత యోధుడు.. బహుముఖ ప్రజ్ఞాశాలి.. అక్షర సూరీడు.. రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావుకు అశేష ప్రజానీకం కన్నీటి వీడ్కోలు పలికింది. ఆదివారం రామోజీ ఫిల్మ్‌సిటీలోని స్మృతివనంలో రామోజీ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో జరిగాయి.

కడసారి చూసేందుకు రాజకీయ, సినీరంగాల ప్రముఖులు, అభిమానులు, కవులు, కళాకారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పత్రిక, సినిమా, సాహిత్య రంగాల్లో రామోజీరావు అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. రామోజీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటిపర్యంతమయ్యారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారు ఆకాంక్షించారు.

ఆదివారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర ప్రారంభమైంది.అంతిమయాత్ర రామోజీ గ్రూపు సంస్థల కార్యాలయాల మీదుగా సాగి ఉదయం 11 గంటలకు స్మృతి వనానికి చేరుకుంది. అంత్యక్రియలను తెలంగాణ ప్రభుత్వం అధికార లాంఛనాలతో నిర్వహించింది. పోలీసుల గౌరవ వందనంతో అంతిమయాత్ర ప్రారంభం కాగా.. రంగారెడ్డి కలెక్టర్ శశాంక, రాచకొండ సీపీ తరుణ్ జోషి దగ్గరుండి ఏర్పాట్లు చూశారు. అంత్యక్రియల ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నియమించిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సాయిప్రసాద్, ఏపీ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ ఆర్సీ సిసోడియా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసులు గౌరవసూచకంగా గాల్లోకి కాల్పులు జరిపారు. రామోజీరావు చితికి ఆయన కుమారుడు, ఈనాడు ఎండీ సీహెచ్ కిరణ్ నిప్పంటించారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, నాయకుడు తీగల కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మహనీయుడు రామోజీరావు

- ఇబ్రహీంపట్నం ప్రాంతంతో రామోజీకి విడదీయలేని అనుబంధం
- కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కృషి
- నాగన్‌పల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి
- రామోజీరావును చివరిచూపు చూసేందుకు వేలాదిగా తరలివెళ్లిన ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజలు

ఇబ్రహీంపట్నంలో రామోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆర్డీవో కార్యాలయం

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 9 : ఇబ్రహీంపట్నం ప్రాంతంతో రామోజీ సంస్థల అధినేత రామోజీరావుకు విడదీయరాని అనుబంధం ఉంది. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషిచేయడంతోపాటు ఇబ్రహీంపట్నం ప్రాంతంలోని పేద ప్రజలకు ఉపాధి కల్పించిన మహనీయుడిగా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. శనివారం తెల్లవారుజామున మృతిచెందిన రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం ఉదయం 10 గంటలకు ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి సమీపంలో ఆయన నిర్మించుకున్న స్మృతివనంలో నిర్వహించారు. ఆయనను చివరిసారిగా చూసేందుకు ఇబ్రహీంపట్నంతోపాటు నాగన్‌పల్లి, పోల్కంపల్లి, నెర్రపల్లి, దండుమైలారం, రాయపోల్, ముకునూరు, అనాజ్‌పూర్, మజీద్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామాల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఆయన అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంతానికి ఎనలేని సేవలందించిన రామోజీరావు సేవలను కొనియాడారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఇంత పెద్ద సినీ పరిశ్రమను స్థాపించి ఈ ప్రాంతంలోని వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించిన గొప్ప మనిషి అని యువత కంటతడి పెట్టుకున్నారు. ఆయన మృతి ఈ ప్రాంతానికి ఎంతో తీరని లోటని గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కోట్లాది రూపాయలతో ఇబ్రహీంపట్నంలో ఆర్డీవో కార్యాలయం, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో ఆర్డీవో కార్యాలయం, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంతోపాటు పోలీస్‌స్టేషన్‌ను రామోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామోజీరావు నిర్మించారు. ఈ ప్రాంతానికి రామోజీరావు చేసిన సేవలు వెలకట్టలేనివని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కొనియాడారు.

రామోజీ దత్తతతో మారిన నాగన్‌పల్లి రూపురేఖలు

ఇబ్రహీంపట్నం మండలంలో రామోజీ ఫిలిం సిటీకి అతి సమీపంలో ఉన్న నాగన్‌పల్లి గ్రామాన్ని రామోజీరావు దత్తత తీసుకుని గ్రామంలో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. గ్రామంలో విద్యార్థుల సౌకర్యార్థం సకల హంగులతో పాఠశాల భవనం, మూడు అంతస్తుల్లో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం, గ్రామంలో ఉచిత తాగునీటి ఫిల్టర్, రచ్చబండ, రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా అంగన్‌వాడీ కేంద్రం, తాగునీటి ట్యాంకులు, ప్రయాణికుల ప్రాంగణాలు, చెత్త సేకరణకు ప్రత్యేక వాహనాల ఏర్పాటు, ఇంటింటికీ మరుగుదొడ్లు, ప్రతి గల్లీకి సీసీ రోడ్లు, వైకుంఠధామంతోపాటు గ్రామంలో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయించారు. గ్రామ ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు రామోజీరావు కల్పించారు.

నాగన్‌పల్లిలో రామోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన పాఠశాల భవనం

మా గ్రామానికి రామోజీరావు దేవుడు

మా గ్రామాన్ని దత్తత తీసుకుని మాకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించిన దేవుడిలాంటి మనిషి రామోజీరావు. ఆయన మృతిచెందారని తెలిసి మా గ్రామమంతా ఎంతో చింతిస్తున్నాం. మా గ్రామాభివృద్ధితో పాటు గ్రామంలో ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించిన రామోజీరావును మా ఊరు ఉన్నంతవరకు గుర్తుంచుకుంటాం. ఆయన వ్యక్తిత్వం, విలువలు, మా పిల్లలకు చెప్తాం.

- బర్తల రంగయ్య, నాగన్‌పల్లి

నాగన్‌పల్లికి రామోజీ సేవలు వెలకట్టలేనివి

నాగన్‌పల్లి గ్రామాన్ని దత్తత తీసుకుని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన గొప్ప మహనీయుడు రామోజీరావు. మా గ్రామంలో ముఖ్యంగా విద్యార్థుల కోసం కార్పొరేట్‌స్థాయిలో పాఠశాలను నిర్మించారు. గ్రామపంచాయతీ, తాగునీటి ఇబ్బందులు లేకుండా లక్షలాది రూపాయలతో తాగునీటి ఫిల్టర్, ఇంటింటికీ మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు గ్రామంలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించిన రామోజీరావు సేవలు మరువలేనివి.

- ఇబ్రాం, నాగన్‌పల్లి యువనాయకుడు

నీట్ అవకతవకలపై విచారణ జరగాలి

టీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య

సిటీబ్యూరో, జూన్ 9(నమస్తే తెలంగాణ): దేశంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో వెల్లడించిన నీట్ ఫలితాలపై పలు అనుమానాలు ఉన్నాయని, నీట్ అవకతవకలపై తక్షణమే విచారణ జరిపించాలని టీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ముందుగా జూన్ 14న ఫలితాలను ప్రకటిస్తామని చెప్పి, ఎలాంటి సమాచారం లేకుండా ఫలితాలు వెల్లడించడంపై దేశవ్యాప్తంగా అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మీడియాతో ఆదివారం మాట్లాడిన ఆయన, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వచ్చిన నాటి నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఘోర తప్పిదాలు, అనేక అవకతవకలు పునరావృత్తం అవుతున్నాయన్నారు. ఎంబీబీఎస్ – బీడీఎస్ గ్రాడ్యుయేట్ స్థాయి ప్రవేశ పరీక్షల్లో మార్కుల కేటాయింపుల్లో పలు అనుమానాలు ఉన్నాయన్నారు. అదే విధంగా ఒకే సెంటర్‌లో పరీక్షలు రాసిన వారందరికీ ఒకే రకమైన మార్కులు వచ్చాయన్నారు. వెల్లడించిన ఫలితాలను బట్టి ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. తక్షణమే ఎన్‌టీఏను రద్దు చేయాలని, సమగ్ర విచారణ చేసి రీ ఎగ్జామ్ నిర్వహించాలన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసు యంత్రాంగం, పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేయాలి
- గోవిందాయిపల్లి గ్రామంలో మృతుల కుటుంబాలకు పరామర్శ

బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కడ్తాల్, జూన్ 9 : మండల కేంద్రంలో జరిగిన యువకుల హత్య కేసును త్వరగా విచారించేందుకు, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేసి నిందితులకు కఠినమైన శిక్ష విధించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 5న కడ్తాల్ సమీపంలోని బట్టర్‌ప్లై వెంచర్‌లోని విల్లాలో గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన శేషుగారి శివగౌడ్, గుండెమోని శివగౌడ్ దారుణ హత్యకు గురయ్యారు. ఈ మేరకు ఆదివారం కడ్తాల్ మండల పరిధి గోవిందాయిపల్లి గ్రామంలోని మృతుల కుటుంబ సభ్యులను మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్, స్థానిక నాయకులతో కలిసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులు హత్యకు గురికావడం విచారకరమని తెలిపారు. జంట హత్యలు జరగడం తెలంగాణ సమాజానికి దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉండే సమయానికి చేతికొచ్చిన కుమారులను కోల్పోవడంతో ఆయా కుటుంబాలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హత్యలు యాదృచ్ఛికంగా జరగలేదని, పక్కా పథకం మేరకే కక్షను తీర్చుకోవడానికి, యువకులను అడ్డు తొలగించుకోవడం కోసం చేశారని ప్రాథమికంగా సమాచారం అందుతున్నదని తెలిపారు. వాట్సాప్ గ్రూప్‌లో వేసిన ఫొటోలను తొలగించినందుకు, కసి తీర్చుకోవడానికి హత్యలు జరిగాయనే కోణంలో కాకుండా, దీని వెనకాల బలమైన రాజకీయ కారణాలు ఉండవచ్చని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని.. వాటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని పోలీసు యంత్రాంగాన్ని ఆయన కోరారు.

ఈ ప్రాంతంలో మాఫియా సంస్కృతిని గతంలో తాను ఎప్పుడూ చూడలేదని, ఈ ప్రాంతంలో నయీం ముఠాకు సంబంధించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయని.. ఆ దిశగా పరిశోధన జరపాలని ప్రవీణ్‌కుమార్ పోలీసులను కోరారు. హత్యల వెనుక ఆ ముఠా మాజీ సభ్యుల హస్తం ఉన్నట్లు గ్రామస్తులందరూ తన దృష్టికి తీసుకువచ్చారని, దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కోరారు. ప్రశాంత వాతావరణం ఉండే ఈ ప్రాంతంలోని గ్రామాల్లో ఇలాంటి దారుణ హత్యలు జరగడం దారుణమని ఆయన పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ దందాలకు సంబంధించిన పంచాయితీలు జరగడం, వాటికి రాజకీయాలు తోడవడం, ఆధిపత్య పోరాటం, ఈ ప్రాంతంలోకి హత్యల సంస్కృతి రావడం విచారకరమన్నారు. ఇందులో నయీం ముఠా ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని, నిందితుల కాల్ డేటా పరిశీలించాలని కోరారు. నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ట్రయల్ పూర్తి చేసి, యావజ్జీవ కారాగార శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, నాయకులు వీరయ్య, తులసీరాంనాయక్, జ్యోతయ్య, పాండునాయక్, లాయక్‌అలీ, రఘు పాల్గొన్నారు.

జేఈఈలో గిరిజన విద్యార్థుల ప్రతిభ

బి.చందులాల్

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 9: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ గిరిజన బాలుర ఐఐటీ స్టడీ సెంటర్ విద్యార్థులు ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష పలితాలలో సత్తా చాటారు. కళాశాలకు చెందిన 63 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు హాజరు కాగా, 50 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బి.చందులాల్ – 291 ర్యాంకు, బి.భద్ర – 295, వినోద్ – 338, శ్రీహర్ష – 625తో పాటు 1000 ర్యాంకుల లోపు 12 మంది విద్యార్థులు ర్యాంకు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ గట్టు సురేందర్ తెలిపారు.

జాడి రేవంత్ (767 ర్యాంకు)

సీహెచ్ అరుణ చంద్ర (883 ర్యాంకు)

డి.నితిన్ (1038 ర్యాంకు)

వి.వినయ్ (1041 ర్యాంకు)

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

శేరి లింగంపల్లి, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తెలంగాణ సాంఘిక, సంక్షేమ శాఖ గౌలిదొడ్డి బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలకు చెందిన 82 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్ష రాయగా, 62 మంది విద్యార్థులు ఐఐటీకి అర్హత సాధించారు. ఓపెన్ కేటగిరి–3, కమ్యూనిటీ ర్యాంకులు–39, 23 ప్రిపరేటరీ ర్యాంకులు సాధించారని గౌలిదొడ్డి బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డి.గణేష్ తెలిపారు. కళాశాలకు చెందిన జె.రేవంత్–767, సీహెచ్ అరుణ చంద్ర – 883, డి.నితిన్–1038, వి.వినయ్–1041, వై.సాయిరాం–1586, సీహెచ్ లక్ష్మీ కాంత్ రెడ్డి – 3360 ర్యాంకులు సాధించినట్టు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ప్రశాంతంగా గ్రూప్ -1 పరీక్షలు

మొయినాబాద్, జూన్ 9 : మొయినాబాద్‌లోని 9 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం గ్రూప్ –1 ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. 5928 అభ్యర్థులకు 3888 మంది (65.58%) హాజరయ్యారు. జేబీ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన రెండు పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతిమాసింగ్ స్థానిక తహసీల్దార్ గౌతమ్‌కుమార్, రీజినల్ కో అర్డినేటర్ రామ్మోహన్‌లతో కలిసి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ఈసారి అభ్యర్థుల బయోమెట్రిక్ వివరాలను నమోదు చేసారు. చేవెళ్ల ఏసీపీ కిషన్‌రెడ్డి అధ్వర్యంలో మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డితో కలిసి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆరంగేట్రానికి వచ్చిన కేవీ రమణాచారి, నటుడు సుమన్ తదితరులు

నాట్య మయూరాలు

కొండాపూర్, జూన్ 9: లయ బద్ధమైన సంగీతానికి అనుగుణంగా కనువిందు చేసే నృత్య ప్రదర్శనలతో త్రిఖ, మిశ్క సిస్టర్స్ కూచిపూడి అరంగేట్ర ప్రదర్శనలు ఆద్యంతం వీక్షకులను ఆకట్టుకున్నాయి. జ్యోతి కళాక్షేత్ర స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ గురువులు జ్యోతిరెడ్డి శిక్షణలో కూచిపూడి నృత్యాలలో ఓనమాలు దిద్దుకున్న ప్రముఖ వైద్యులు కీర్తి, వికాస్ గౌడ్‌ల కుమార్తెలు త్రిఖ గౌడ్, మిశ్క గౌడ్‌ల కూచిపూడి రంగప్రవేశ నృత్య ప్రదర్శనలు మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఆదివారం అట్టహాసంగా సాగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విద్యాశాఖల ప్రిన్సిపాల్ సెక్రటరి బుర్ర వెంకటేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్రిఖ, మిశ్క సిస్టర్స్ కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయన్నారు. ఎంతో పరిణతితో, ఎంతో కాలంగా అనుభవం ఉన్న నృత్యకారులుగా అక్కాచెల్లెళ్ల ప్రదర్శనలున్నాయంటూ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కేవీ రమణాచారి, సినీ నటుడు సుమన్, భారతీయం సత్యవాణి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, ఎంఎస్ గౌడ్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కొండల్‌రెడ్డి

న్యాయవాదుల సమాఖ్య అధ్యక్షుడిగా కొండల్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 9(నమస్తే తెలంగాణ): తెలంగాణ న్యాయవాదుల సంఘాల సమాఖ్య (ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్) అధ్యక్షుడిగా రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా కోర్టుల ప్రాంగణంలో ఆదివారం జరిగిన సమావేశంలో తెలంగాణవ్యాప్తంగా ఉన్న 104 బార్ అసోసియేషన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వై.కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాంపల్లి కోర్టు అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డిని ఎన్నుకున్నారు.